క్లుప్తంగా

మట్టి టిప్పర్ సీజ్

గుర్రంకొండ: మండల కేంద్రంలో మట్టి టిప్పర్‌ను సీజ్ చేసినట్లు ఏఎస్ఐ నరసింహులు తెలిపారు. బుధవారం గుర్రంకొండకు సమీపంలో మట్టిని అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను తహసీల్దార్ శ్రీనివాసులు, వీఆర్వో సదాశివప్ప తనిఖీ చేసి సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు కేసు నమోదు జరిమాన విధించి చర్యలు తీసుకొంటామన్నారు.

ఘనంగా మాజీ ప్రధాని వాజ్‌పేయి జయంతి



వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

గుర్రంకొండ: మండలకేంద్రమైన గుర్రంకొండలో మాజీ ప్రధాన అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతిని ఘనంగా నిర్వహించారు. బుధవారం బీజేపీ నాయకులు గుర్రంకొండలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. దేశానికి వాజ్‌పేయి చేసిన సేవలను గుర్తు చేసుకొని కొనియాడారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు రామాంజులు, శేషాద్రినాయుడు, భరత్, చింతిర్ల కిషోర్, రామాంజులురెడ్డి, రెడ్డెప్ప, మురళి, రాజేష్, మధు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

బి.కొత్తకోట: ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొనడంతో ఓ యువకుడి కాలు విరిగిన ఘటన బుధవారం బి.కొత్తకోటలో జరిగింది. స్థానిక మెకానిక్ అఫ్రిద్ (20) బైక్‌పై పీటీఎం రోడ్డులో వెళ్తుండగా ఏటి బ్రిడ్జి వద్ద మరో బైక్ ఎదురుగా వస్తున్న ఢీకొంది. ఈ ఘటనలో అఫ్రిద్ కాలు విరగడంతో బాధితున్ని 108లో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు వివరాలు సేకరించారు.

రేషన్ డీలర్ల నియామకానికి దరఖాస్తు చేసుకోండి

కలకడ : మండలంలోని ఖాళీగా ఉన్న ప్రభుత్వ చౌకదుకాణల డీలర్లకు అర్హత కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ ఫనికుమార్ తెలిపారు. బుధవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటనలో వివరాలు తెలియజేశారు. ఆహార, పౌరసరఫరాల శాఖ తరపున ప్రభుత్వ చౌకదుకాణం డీలర్‌గా శాశ్వత నియామకం చేపట్టడానికి ఈనెల 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. రాత పరీక్ష ద్వారా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఖాళీల వివరాలిలా.. ఎగువపాళ్యెం–మహిళ, నడిమిచెర్ల–జనరల్, కోన –ఓసీ మహిళ, తిప్పిగారిపల్లె–బీసీ–డీ మహిళ, గంగిరెడ్డిగారిపల్లె–బీసీఈ మహిళ, కోటగుడిబండ–ఈడబ్ల్యూఎస్, శింగనొడ్డుపల్లె బీసీ–బీ, కలకడ–ఈడబ్ల్యూఎస్, కదిరాయచెర్వు–ఓసి, కలకడ కొత్తపల్లె–బీసీ డి కి కేటాయించినట్లు తెలిపారు. నిరుద్యోగ, యువతీ యువకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

–ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

తంబళ్లపల్లె: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ అండగా ఉంటానని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి తెలిపారు. బుధవారం తంబళ్లపల్లెలో మధుకర్‌రెడ్డి నూతనంగా నిర్మించిన భవనంలో జైకిసాన్ ఫర్టిలైజర్స్ అండ్ ఫార్మర్ షాపును ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలంలో పరిస్థితులపై కార్యకర్తలతో ఆరా తీశారు. ఆయన వెంట మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కరాటేలో చిన్నారి హేమాంష్ ప్రతిభ



హేమాంష్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె : ఆరేళ్లకే కరాటేలో బ్లాక్‌బెల్ట్ సాధించడమే కాకుండా, చెన్నైకు చెందిన కలాం బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోనూ మదనపల్లెకు చెందిన చిన్నోడు డీఏ.హేమాంష్ చోటు దక్కించుకున్నాడు. బుధవారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా చేతుల మీదుగా కలాం బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికేట్, మెడల్, మొమెంటోను అందుకున్నాడు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, డీఏ.హేమాంష్‌ను ఆశీర్వదించారు. శిక్షణ ఇచ్చిన కరాటే మాస్టర్ ఏఆర్.సురేష్‌ను అభినందించారు.

28న జాబ్ మేళా

రాజంపేట టౌన్: పట్టణంలోని కాకతీయ విద్యా సంస్థ ఆవరణలో ఈ నెల 28న ఉదయం 10 గంటల నుంచి జాబ్ మేళా నిర్వహించనున్నట్లు న్యాక్ శిక్షణా కేంద్రం ఇన్‌ఛార్జ్ జి.శంకరయ్య ఓ ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు 7989733065, 8247035161 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

క్రీస్తు జననం మానవాళికి మహోదయం

- వైభవంగా క్రిస్మస్ సంబరాలు
- ప్రపంచ శాంతికి క్రీస్తు మార్గమే అనుసరణీయం
- డివిజన్ సంఘు కాపరి రెవ.డాక్టర్ సునిల్ వరకుమార్



జేసీఎం చర్చిలో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవ సోదరులు



మదనపల్లె సిటీ: కరుణామయుడైన ఏసుక్రీస్తు బాలయేసుగా భూమిపై అవతరించిన వేళ విశ్వాసుల హృదయాల భక్తిభావంతో నిండిపోయాయి. స్టార్లు కాంతులీనాయి. క్రిస్మస్ సంబరాలు అంబరాన్నంటాయి. క్రైస్తవులందరూ సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. విద్యుత్‌దీపాల అలంకరణతో చర్చిలన్నీ శోభిల్లాయి. క్రిస్మస్ సందర్భంగా భక్తులందరూ బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు చర్చిలకే పరిమితమయ్యారు. నూతన దుస్తులు ధరించి హ్యాపీ క్రిస్మస్..మేర్రీ క్రిస్మస్ అంటూ పరస్పర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చర్చిలన్నీ విశ్వాసులతో కిటకిటలాడాయి. బిషప్‌లు, పాస్టర్లు దైవసందేశం వినిపించారు.

క్రీస్తుమార్గమే అనుసరణీయం

ప్రపంచ శాంతికి క్రీస్తుమార్గమే అనుసరణీయమని మదనపల్లె డివిజన్ సంఘు కాపరి రెవ. డాక్టర్ సునిల్ వరకుమార్ హి తవు పలికారు. మదనపల్లె పట్టణం జేసీఎం చర్చిలో బుధవారం క్రిస్మస్ పర్వదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయన క్రైస్తవులను ఉద్దేశించి దైవ సందేశం ఇచ్చారు. మానవుల కష్టాలు,పాపాలు తొలగించేందుకే క్రీస్తు మనిషి రూపంలో జన్మించారని, మనందరి పాప భారాన్ని శిలువపై మోసి రక్తాన్ని చిందించారని వివరించారు. అందుకే క్రీస్తు లోక రక్షకుడని కొనియాడారు. క్రీస్తు మార్గంలో అందరూ పయనించాలని సూచించారు. మానవత్వానికి చెడు నుంచి మంచికి, దురాస నుంచి దాతృత్వం,త్యాగాలను జీసస్ బాటలు వేశారన్నారు. లోకానికి శాంతి సందేశాన్ని పంచిన లోకరక్షకుడు ఏసుప్రభువని తెలిపారు. కార్యక్రమంలో జేసీఎం చర్చి కార్యదర్శి భక్తవత్సలం, కోశాధికారి ఆనంద్, వైఎస్సార్ సీపీ మున్సిపల్ కౌన్సిలర్ పాల్ చంద్రశేఖర్, ఆర్టీసీ సీసీఎస్ రాష్ట్ర డెలిగేట్ వినోద్‌కుమార్, సభ్యులు సూరి తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా క్రిస్మస్ ప్రార్థనల్లో పాల్గొని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. డేవిడ్ సంజయ్ కొరియర్ బృందం ఆలపించిన భక్తిగీతాలు అలరించాయి. స్థానిక సీఎస్ఐ కాంపౌండ్ ఆవరణంలోని షకీనా ఫెయిత్ ఫౌండేషన్ చర్చిలో ఫాదర్ డేవిడ్‌రాజ్ ఏసుక్రీస్తు జననం గురించి తెలియజేశారు. దినేష్‌పాల్, వివేక్‌పాల్ తమ దైవ సందేహం వినిపించారు. స్థానిక కురవంకలోని హోసన్నా గోస్పెల్ మిషన్ చర్చిలో జరిగిన క్రిస్మస్‌వేడుకల్లో పాస్టర్ ప్రేమ క్రిస్మస్ పండుగ విశిష్టతను వివరించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా చిన్నారులు చేసిన నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. క్రిస్మస్ తాత వేషధారణలతో పాటు పలు నాటికలు ప్రదర్శించారు. వదనపల్లె మండలం ఆరోగ్యవరం చర్చి, సెయింట్‌లూక్ చర్చి, గుడిసివారిపల్లెలోని చర్చిలలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఆకట్టుకున్న క్రిస్మస్ ట్రీ

చర్చి ఆవరణంలో ఏర్పాటు చేసిన క్రిస్మస్ ట్రీ ఆకట్టుకుంది. సుమారు 25 అడుగుల ఎత్తుతో ఏర్పాటు చేశారు. క్రిస్మస్ ట్రీ చుట్టూ స్టార్‌లు, బొమ్మలు పెట్టారు. పలువురు క్రిస్మస్ ట్రీ వద్ద సెల్‌ఫోన్‌ల్లో సెల్ఫీలు తీసుకున్నారు.హోప్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఏసు జననం సెట్టింగ్ ఆకట్టుకుంది.

పీలేరులో..

పీలేరురూరల్ : క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం పీలేరు పట్టణంలోని స్టీన్‌పాల్స్ ప్రార్థన మందిరం తోపాటు ఏసీఎల్ఎం చర్చి, లూథరన్, హెబ్రోన్, రెహబోతు, ఇమానియేల్, షకీనా, లవ్ ఆఫ్ జీసస్, బెతెస్తా తదితర చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు మాట్లాడుతూ క్రీస్తు చూపించిన మార్గంలో నడవాలని సూచించారు. చర్చిల వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు. ఏసీఎల్ఎం చర్చిలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో పాస్టర్లు బి. జర్మియా, స్టీఫన్ పాల్, సుందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలలో మాజీ ఎమ్మెల్యే చింతల

కలికిరి: పీలేరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి క్రిస్మస్ వేడుకలలో పాలు పంచుకుని అనాథలకు పండ్లు పంచిపెట్టారు. విజయవాడలోని బందరు రోడ్డు మదర్ థెరిస్సాకు సంబంధించిన నిర్మల్ హృదయ్ భవన్‌లో బుధవారం ఆయన క్రిస్మస్ ప్రార్థనలకు హాజరయ్యారు. అనంతరం అక్కడ అనాథలకు దుప్పట్లు, పండ్లు, రొట్టెలు పంచిపెట్టి, అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

గుర్రంకొండలో..

గుర్రంకొండ: మండలంలోని గుర్రంకొండ, తరిగొండ, నక్కలవారిపల్లె గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుధవారం క్రిస్మస్‌డే సందర్భగా చర్చిలన్నింటిని రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. చర్చిల్లో కేక్‌లు కట్‌చేసి శుభకాంక్షలు చెప్పుకొన్నారు. ఈసందర్భంగా పలువురు బహుమతులను ఇచ్చి పుచ్చుకొన్నారు.

కలకడలో..

కలకడ : స్వార్థం, ద్వేశం వీడి మనుషులలో మంచి పెంచడమే ఏస్తుక్రీస్తు ఆజ్ఞ అని పాస్టర్ శేఖరయ్య అన్నారు. బుధవారం క్రిస్మస్ సందర్భంగా మండలంలోని కోన పంచాయతీ గంగిరెడ్డిగారిపల్లె, కలకడ కొత్తపల్లె, బాలయ్యగారిపల్లె పంచాయతీ యర్రయ్యగారిపల్లె, తదితర చర్చిలలో ప్రార్థనలు చేశారు. గురువులు, ప్రభువు సందేశాన్ని చదివి వినిపించారు. పేదలకు అన్నదానం, వస్త్ర దానం చేశారు.



ఆకర్షణగా నిలిచిన క్రిస్మస్ ట్రీ

త్యాగానికి ప్రతీక

పెద్దతిప్పసముద్రం: ప్రపంచ మానవాళిని రక్షించేందుకు కరుణామయుడైన యేసు క్రీస్తు ఈ లోకానికి వచ్చారని పాస్టర్ జయదీప్ రాజా అన్నారు. బుధవారం మండలంలోని కందుకూరు పీటీఎం, కాట్నగల్లు , రంగసముద్రం, కొత్తపల్లె తదితర గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విశ్వ మానవాళికి నవోదయమని పాస్టర్లు అన్నారు. అనంతరం కేక్ కట్ చేసి పంచి పెట్టారు. కందుకూరు జీసస్ ఇన్ లైఫ్ మినిస్ట్రీ చర్చిలో ఆత్మీయలకు భోజన సౌకర్యం కల్పించి పలువురుకి దుస్తులు పంచి పెట్టారు.

భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు

ములకలచెరువు: మండలంలోని చర్చిల్లో బుధవారం క్రిస్మస్ పండుగ సందర్భంగా క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. ములకలచెరువు, పర్తికోట, బురకాయలకోట సీఎస్ఐ చర్చిల్లో పాస్టర్లు సందేశాలను వినిపించారు. కార్యక్రమాల్లో కేక్ కట్ చేసి పండుగ ప్రాముఖ్యతను చాటుకున్నారు.

తంబళ్లపల్లెలో..

తంబళ్లపల్లె: మండల కేంద్రంలోని సీఎస్ఐ చర్చిలో బుధవారం క్రిస్టియన్ సోదరులు క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పాస్టర్ బాలరాజు ఏసు ప్రభువు సందేశాన్ని వినిపించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కన్నెమడుగు విజయ్ అన్నదానం ఏర్పాటు చేశారు. పేదలకు ధాన,ధర్మాలు చేశారు. అదే విధంగా ఉప్పులూరివాండ్లపల్లె, పంచాలమర్రి, భద్రయ్యగారిపల్లె, చింపిరెడ్డిగారిపల్లె చర్చిలలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

మానవాళికి మహోదయం

కురబలకోట: క్రీస్తు జననం మానవాళికి మహోదయమని మహబూబాబాద్ కాట్రపల్లెలోని సీయోను ప్రార్థన మందిర దైవ సేవకులు ఎబినేజర్ పేర్కొన్నారు. క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకుని బుధవారం అంగళ్లు సీయోను ప్రార్థన మందిరంలో జరిగిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా వాక్యోపదేశం గావించారు. క్రిస్మస్ యావత్ ప్రపంచానికి పర్వదినమన్నారు. యేసును అనుసరించడమే అసలైన క్రిస్మస్ అన్నారు. పాపాలు, శాపాల నుంచి క్రీస్తు రక్షిస్తాడన్నారు. ప్రేమ, సంతోషం, శాంతి, సమాధానం. కరణకు ప్రతి రూపంగా నిలిచాడన్నారు. ప్రధాన పాస్టర్ విక్టర్ వేదనాయకమ్, నాతానురెడ్డి, తిమోతి, నెహెమ్యా తదితరులు పాల్గొన్నారు. కామూరివారిపల్లె, ఆరోగ్యపురం, కురబలకోట కాలనీ, దాదంవారిపల్లె, తెట్టు, చేనేతనగర్, కంటేవారిపల్లె, పూసావారిపల్లె తదితర గ్రామాల్లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు.

బి.కొత్తకోటలో..

బి.కొత్తకోట: క్రిస్మస్ పర్వదిన వేడుకలు బుధవారం మండలంలోని చర్చిలలో ఘనంగా నిర్వహించుకున్నారు. బి.కొత్తకోటలో రంగసముద్రంరోడ్డు, నందిశెట్టివీధి, శంకరాపురం, బడికాయలపల్లి, తోకలపల్లి, గోళ్లపల్లి, కుమ్మరిపల్లి తదితర ప్రాంతాల్లోని చర్చిల్లో ప్రత్యేక అలంకరణలు చేసి, విద్యుత్‌దీపాలతో అలంకరించారు. చర్చిల్లో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు

నిమ్మనపల్లె : మండల పరిధిలో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఏసుక్రీస్తు జన్మదినం సందర్భంగా క్రీస్తు ఆరాధకులు వెంకోజీగారిపల్లె, నిమ్మనపల్లె, గుండ్లబురుజు, రాచవేటివారిపల్లె, రెడ్డివారిపల్లె, బండ్లపై, ముష్టూరు, అగ్రహారం, సామకోటవారిపల్లె, వెంగంవారిపల్లె, ఎగువమాచిరెడ్డిగారిపల్లె, దిగువమాచిరెడ్డిగారిపల్లె తదితర గ్రామాల్లోని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చి పాస్టర్లు ఏసుక్రీస్తు నామాన్ని స్మరిస్తూ క్రీస్తు సందేశాన్ని వినిపించారు.



దైవసందేశం ఇస్తున్న రెవ డాక్టర్ సునిల్ వరకుమార్



ఆకట్టుకున్న ఏసు జననం సెట్టింగ్



అంగళ్లు చర్చిలో సందేశమిస్తున్న ఎబినేజర్

రామసముద్రంలో..

రామసముద్రం : మండలంలో బుధవారం ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. మండల కేంద్రంలోని చర్చిలో ప్రజలంతా శాంతి సామరస్యాలతో ఎదుటివారిపై జాలి, కరుణ చూపాలని పాస్టర్ డాక్టర్ చంద్రకిరణ్ అన్నారు. వనగానిపల్లె ప్రేమ స్వరూపి చర్చిలో భారీ కేక్ కట్‌చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అ పిల్లలకు బహుమతులు, పెద్దలకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాస్టర్ మంజుల కిరణ్, సోమశేఖర్, సంఘం కమిటీ సభ్యులు యశ్వంత్, ప్రభుకిరణ్, బధ్రి, హరిత, స్వప్న తదితరులు పాల్గొన్నారు.



పీలేరు: ఏసీఎల్ఎం చర్చిలో ప్రార్థనలు



క్రిస్మస్ ప్రార్థనలకు హాజరైన మాజీ ఎమ్మెల్యే చింతల



గుర్రంకొండలో కేక్ కట్ చేస్తున్న పాస్టర్లు



కందుకూరు చర్చిలో సందేశమిస్తున్న పాస్టర్ జయదీప్‌రాజా



బి.కొత్తకోట: శశంకరాపురం చర్చిలో ప్రార్థనలు



ములకలచెరువు చర్చిలో..



తంబళ్లపల్లె సీఎస్ఐ చర్చిలో..



రామసముద్రంలో క్రిస్మస్ వేడుకలు

గురుకుల పాఠశాల విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థినులు, ఉపాధ్యాయులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సోమశేఖర్

కలికిరి: స్థానిక మహాత్మా జ్యోతిబాపూలే వెనకబడిన తరగతుల బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు జాతీయ స్థాయిలో ప్రతిభ చాటారు. విప్రో ఎర్తియన్ అవార్డ్స్ – 2024కు సంబంధించి జాతీయ స్థాయిలో మొత్తం 1550 పాఠశాలల నుంచి ప్రాజెక్టులను సమర్పించారు. వాటిలో 23 ప్రాజెక్టులను ఆ సంస్థ అవార్డులకు ఎంపిక చేసింది. వీటిలో దక్షిణ భారత దేశం నుంచి రెండు ప్రాజెక్టులకు చోటు దక్కగా ఒకటి కలికిరి జ్యోతిబాపూలే వెనకబడిన తరగతుల బాలికల గురుకుల పాఠశాల. ఈ పాఠశాల విద్యార్థినులు జె.శ్రీరూపిక, కె.ఖ్యాతి, టి.భవ్యశ్రీ, ఎం.చందన అగర్వాల్, పి.సుప్రియ టీం 'సస్టైనబులిటి అండ్ ఎన్విరాన్‌మెంట్' అనే అంశంపై ఏర్పాటు చేసిన ప్రాజెక్టు ఎంపికైంది. ప్రాజెక్టు రూపొందించిన విద్యార్థినులకు ఈ ఏడాది ఫిబ్రవరి 21, 22 తేదీలలో బెంగళూరులో విప్రో ఫౌండేషన్ చైర్మన్ రిషద్ ప్రేమ్ జీ అవార్డు అందజేయనున్నారు. పాఠశాల విద్యార్థినులు రూపొందించిన ప్రాజెక్టు జాతీయ స్థాయిలో ఎంపిక కావడం పట్ల విద్యార్థినులను, వారిని ప్రోత్సహించిన ఉపాధ్యాయులు అఫ్సానా, స్వర్ణకుమారి, దిల్షాద్ బేగంను ప్రిన్సిపాల్ వై.సోమశేఖర్ బుధవారం అభినందిచారు.

పోరుబాటను విజయవంతం చేయండి

కలికిరి: నియోజకవర్గ కేంద్రం పీలేరు పట్టణంలో శుక్రవారం ఉదయం రాజంపేట ఎంపీ పీవీ మిథున్ రెడ్డి, పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో విద్యుత్ చార్జీల పెంపుపై పోరుబాట కార్యక్రమం నిర్వహించనున్నారు. మండలం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని మండల పార్టీ కన్వీనర్ రమేష్ కుమార్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో శుక్రవారం ఉదయం 9.30 గంటలకు పీలేరు పట్టణం తిరుపతి రోడ్డులోని వీఎస్ఆర్ కళ్యాణ మండపానికి చేరుకోవాలని, 10 గంటలకు అక్కడినుంచి ర్యాలీగా వెళ్లి విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తామని తెలిపారు.


ఓపెన్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్లకు స్పాట్ అడ్మిషన్లు

మదనపల్లె సిటీ: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఓపెన్ స్కూల్‌లో తత్కాల్ కింద పదో తరగతి ఇంటర్మీడియట్‌కు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్ అసిస్టెంట్ కో ఆర్డినేటర్ పి.మహమ్మద్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. తత్కాల్ కింద అపరాధ రుసుముతో అభ్యర్థులు అడ్మిషన్ పొందవచ్చునని తెలిపారు. అభ్యర్థులు అడ్మిషన్ల కోసం జెడ్పీ ఉన్నత పాఠశాలలలోని ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్‌లో లేదా 8121852786ను సంప్రదించాలని కోరారు.

సమతారాజ్య స్థాపనకు రాజ్యాంగం కావాలి

పీలేరు రూరల్ : సమతారాజ్య స్థాపనకు భారత రాజ్యాంగం కావాలని మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణికుమార్ అన్నారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద మనస్మృతి గ్రంధ ప్రతులను దహనం చేశారు. భారత రాజ్యాంగం వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు అమృతతేజ, శ్రీకాంత్, మల్లికార్జున, ధనాసి వెంకటరామయ్య, సాయిసంపత్, గుండ్లూరు సదాశివ, రాజేశ్వరి, శ్రీనివాసులు, చాన్‌బాషా, మహబూబ్‌బాషా, షాహిన్‌షా, ఆనంద్, గంగాధర్, రవిచంద్ర, రాజేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్‌పై నో ప్లాస్టిక్



గాజు నీటి బాటిళ్లు

బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై పర్యావరణ పరిరక్షణ కోసం టూరిజం అధికారులు ప్రయత్నాలు ప్రారంభించారు. కొండకు వచ్చే సందర్శకులు తాగునీటి బాటిళ్లను కొనుగోలు చేస్తుంటారు. మొన్నటిదాక ప్లాస్టిక్ నీటి బాటిళ్లను విక్రయిస్తూ వచ్చారు. తాగేసిన ప్లాస్టిక్ బాటిళ్లకు రోడ్లపై పరబోస్తుండటంతో టూరిజం అధికారులు ప్లాస్టిక్ లేకుండా చూసేందుకు గాజు బాటిళ్లలో నీటి విక్రయాలు ప్రారంభించారు. ప్రస్తుతం టూరిజం బార్, రెస్టారెంట్‌లో గాజు బాటిళ్ల మాత్రమే అందుబాటులో ఉంచారు. టూరిజం మాదిరిగా వ్యాపారులు ఇదే పంథా కొనసాగిస్తే కొండపై ప్లాస్టిక్ లేకుండా చేయవచ్చు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



పెన్షనర్లను సన్మానిస్తున్న దృశ్యం

పీలేరు : పెన్షనర్ల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి. చంద్రారెడ్డి అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం పెన్షనర్ల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షనర్లు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై ప్రభుత్వం స్పందించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ, డీఏ బకాయిలను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆడిటర్ గౌతమ్ మాట్లాడుతూ పింఛనుదారులందరూ తమ ఆదాయపు పన్ను రిటర్నులను వెంటనే దాఖలు చేయాలన్నారు. ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్న్స్ గురించి వివరించారు. అనంతరం పెన్షనర్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మానవతా చైర్మన్ వంగిమళ్ల రామచంద్ర, యూటీఎఫ్ నాయకులు రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తంబళ్లపల్లె: తంబళ్లపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ నాగవేణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తంబళ్లపల్లె మండలంలో ఖాళీగా ఉన్న హెల్పర్ (సహాయకురాలు) అప్పమ్మగారిపల్లె (బీసీ–డి), మర్రిమాకులపల్లె (ఓసీ–ఓహెచ్), కొటాల (ఎస్‌సి), గోపిదిన్నె (ఎస్‌సీ), దిగువ సుగాలితాండా(ఎస్‌టీ), ఉప్పులూరివాండ్లపల్లె(ఓసి), మండంవారిపల్లె(ఎస్‌సీ), మూలపల్లె(బీసీ–ఎ), కురబలకోట మండలంలో మండెంవారిపల్లె(బీసీ–డీ), గంగిరెడ్డిగారిపల్లె(ఈడబ్ల్యుస్), కమతంపల్లె(ఎస్‌సి), చేనేతనగర్ (బీసీబీ), మిని అంగన్‌వాడీ కార్యకర్త ఆర్‌సి కురవపల్లె(ఓసి), పెద్దమండ్యం మండలంలో గుడిసివారిపల్లె సహాయకురాలు (ఓసిహెచ్‌హెచ్) రిజర్వేషన్ చేశారన్నారు. రిజర్వేషన్ల మేరకు స్థానిక వివాహిత మహిళలు 21 సంవత్సరాలు నుండి 35 సంవత్సరాల లోపు పదో తరగతి పాసైన మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. జనవరి 2వతేదీలోపు పూర్తి చేసిన దరఖాస్తులు ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

పీలేరు ప్రాజెక్టు పరిధిలో..

కేవీపల్లె : ఐసీడీఎస్ పీలేరు ప్రాజెక్టు పరిధిలో పీలేరు, కేవీపల్లె, కలకడ మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ రాజమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. మూడు మండలాల్లో ఖాళీల వివరాలు మంగళవారం ఆమె వెల్లడించారు. కలకడ మండలంలోని కలకడ–2 (ఓసీ), డి.బాటవారిపల్లె (ఓసీ)మెయిన అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టుల ఖాళీలున్నట్లు తెలిపారు. పీలేరు మండలంలోని మొటుకుపల్లె (ఓసీ), యర్రదొడ్డిగారిపల్లె (ఓసీ), రామానాయక్‌తాండా (ఓసీ), కేవీపల్లె మండలంలోని తూర్పు హరిజనవాడ (ఎస్సీ), కలకడ మండలంలోని ఝరిగడ్డ కొత్తపల్లె (బీసీ–) మినీ అంగన్‌వాడీ పోస్టులు ఖాళీలున్నట్లు వివరించారు.